# తుపాకీపడవ రాజనీతి

ఊరికో యాహ్యాఖానుంటే యింటికో ఇందిరా గాంధి వుండటం తప్పనిసరి. ఫిమినైన్ పవర్ గురించి త్యాగరాజుకి బాగా తెలుసుగనుకే 'ఎంతవారలైన కాంత దాసులే' అన్నాడు. మిస్టర్ రాందాసు కూడా "నను(బోవమని చెప్పవే సీతమ్మ తల్లీ" ఏదో వేళచూసుకుని అన్నాడు. గనుక మన కాంతదాసులు తెలుసుకోవలసిందోటుంది. మన లేడిస్లో కూడా స్లోగా వెదికితే గడ్డి మేట్సులాటి మగాళ్ళ పక్కన గన్ బోట్సులాటి ఆడాళ్లున్నారు. అంతెందుకు మావేలువిడిచిన పెద్దమేనత్తనే తీసుకోండి, ఆవిడ సంసారం ఒక సెవెన్త్ ఫ్లీట్లా వుంటుంది. ఆవిడ మొగుడు టై, సూటూ, బూటూ ఊడదీసి పిలక పెట్టించి గావంచా కట్టిన 'నిక్సన్'లా వుంటాడు.

ఆవిడ (బదరొకడున్నాడు. భుజకీర్తులూ మిల్రటీ దుస్తులు తీసేసి, గూడుబండి (క్రాపు చేయించి, రెండెడ్ల బండిమీద చెన్నాకోలు చేతికిచ్చి కూర్చోపెడితే అచ్చం అన్నీ వూడిపోయి సర్వాంగక్షవరమయిన యాహ్యా ఖాన్‌లా వుంటాడు. మా మేనత్త ఆడబడుచొకావిడ అచ్చం చెడిపోయిన పాకిస్తాన్ టాంకులా వుంటుంది. మా మేనత్త అత్తగారొకావిడ యింకా బాగానే వుంది. పళ్ళుకదల్లేదు, చేగోడీలు అవీ తింటుంది. ఇంటి దగ్గరున్నప్పుడే ఆవిడకి మడి. నిప్పుల్ని కడుగుతుంది. మళ్ళీ రైల్లో కారప్పూస పునుకులూ అవీ కొనుక్కుని దొంగతనంగా మేస్తుంది. అయితే చూడ్డానికి మా(త్రం ఆవిడ భారీశతఘ్నిలా వుంటుంది. మనం వారిని గుర్తించాలే కాని మన చుట్టుపక్కల లేడీస్‌లో కూడా మహా పురుషులున్నారు. యిదివరకీ మాట ఎక్కడో విన్నాను. విన్నానో లేకపోతే నేను అన్నానో - మామేనత్త గారింట్లో మిస్సైలీబోట్సులాటి కు(ర్రాళ్లూ హెలికాప్టర్లాంటి అమ్మాయిలు వున్నారు పెళ్ళికెదిగి. మా పిన్నిగారి మొగుడు మునిగిపోయిన జలాంతర్గామిలా వుంటాడు. అయితే మా పిన్ని మా(త్రం గస్తీనౌకేననుకోండి. అదల్లా కనిపెట్టి తిరుగుతున్నప్పటికీ పేకాట్లో, యాహ్యాఖాన్ తూర్పు పాకిస్థాన్ పోగొట్టుకున్నట్లు యావదాస్తీ పోగొట్టుకున్నాడు. ఇప్పుడాయన్దగ్గరేంలేదు. మంచం తిరగేస్తే పడవ. అంతే - మా దొడ్డమ్మ కొడుకులున్నారు. వాళ్ళు జెట్లు. మిగ్గులు నాట్లు, మారుత్లే అనుకోండి. చూసి రమ్మంటే కాల్చొస్తారు. అంతెందుకు మా బ్లడీ బంధువర్గంలోనే అన్ని రకాల శాల్తీలు శాంపిల్సు వున్నాయనుకోండి.

ఈ మగాళ్ళను మనం కాయలేవండీ అంటూ వచ్చింది మా పొరుగింటి మీనాక్షమ్మ. "అవునమ్మా నువ్వేమన్నా తుపాకీ పడవ్వా కాపలా కాయటానికి" అని నేను చెప్పొద్దూ ఎగదోశాను. ఆవిడ బుడిబుడి దీర్ఘాలు తీసింది చీత్తూ, ముక్కు ఎగబీలుస్తూ. వూరుకోవమ్మా అని ఓదార్చి "గన్‌బోటు డిప్లమసీ" అవలంబించమని చెప్పాను.

సంసారం సాగరం కదా, సాగరం అంటే సము(ద్రం కదా! సము(ద్రంలో మీవార్ని శ(తుస్థావరం అనుకో అన్నాను, అనుకుంటానంది. అప్పుడు నువ్వు మీ వాళ్ళందర్నీ పిలిపించి

ఒక సప్తమ నౌకా దళాన్ని తయారుచేసి మీవారికి ఎక్కడా అప్పుపుట్టకుండా చెయ్యి. మీవాళ్ళతని రాకపోకలు, విందులూ, విహారాలు కనిపెడుతూంటారు. అందుమీదట ఎక్కడ చూసినా నీ సప్తమ నౌకాదళం సంసార సముద్రంలో ప్రత్యక్షమయేసరికి నీ నాధుడు చేతులెత్తేసి శరణు శరణు అంటూ వచ్చి నీ కాళ్ళమీద పడతాడు. ఇదే తుపాకీ పడవరాజనీతి పొమ్మన్నాను. నవ్వుకుంటూ పోయింది. మన ఇందిరమ్మ చెప్పినట్లు ఇరుగు పొరుగు దేశాలకి సహాయ పడటం మన కనీస కర్తవ్యం కదా అని నేను సంతృప్తి చెందాను. అసలంతదాకా ఎందుకు? సెవెన్త్ ఫ్లీటు అంటూ కంగారుపడ్డారు కాని – మనం శ్రావణ మంగళవారం పేరంటానికి లేదా సంకురాత్రి బొమ్మల నోములకి బయల్దేరి నప్పుడు రోడ్లమీద మన లేడీస్ గుంపులు గుంపులుగా నడుచుకొని వెళ్తోంటే సప్తమ నౌకాదళాన్ని మించిపోయి వుండదూ మన హడావిడి. ప్రతి పండక్కీ మనలేడీస్ అంతకుముందు చిన్నసైజు పడవల్లాగ వయ్యారంగా నడచి వెళ్ళేవాళ్ళు పేరంటాల్లో నౌకాదళాన్ని మించిపోయినట్లు కనిపిస్తారు. మన పేరంటాలు, వ్రతాలు, పూజలు ఎట్‌సెట్రాలన్నీ మగాళ్లను లొంగదీసుకోటానికి గన్‌బోటు డిప్లమసీలా వుపయోగపడతాయి. ఇవి పాతవే అనుకోండి మన ట్రిక్కులు ట్రిక్కులే కదా!

వాళ్ళు సముద్రంలో బల ప్రదర్శన చేస్తే మనం ఆడాళ్ళం సంసారంలోనే బల ప్రదర్శన చేస్తాం. ఆమాటకొస్తే కోటిమంది శరణార్థులొచ్చి మనదేశంలో తిష్ఠవేశారని పన్నులు పెంచుకున్నాం అవునా? మన బ్లడీ బంధువర్గంలోనే మునిమనవల్తో సహా తరలివచ్చి చుట్టాలిళ్ళపై బడి తినేవాళ్లెంతమంది లేరూ? పైగా మన ఎగస్పార్టీ బంధువుల్తో చేరి పేచీలు పెట్టేవాళ్ళు కూడా వుంటారు. మన్ని హడలకొట్టి యాగీ చెయ్యటానికి మనవాళ్ళలోనే "జుల్ ఫికర్ అలీ భుట్టో" లు వుంటారు. ప్రపంచ సంస్థ నోరుమూసుకు పడుకున్నట్లు మనం పెద్దవాళ్ళ మనుకుంటున్న మనవారిలోనే ఏటైంకా టాకుటాకే వాళ్ళున్నారు. నోరున్నవాడిది రాజ్యమై పోయింది.

మనం అహింస అహింస అనకుండా, ఒక చెంప వాయిస్తే శత్రువుకి రెండో చెంప చూపెట్టకుండా అలీన విధానం బెండకాయ పులుసు అని కూచోకుండా సమయమూ సందర్భమూ తెలుసుకుని రష్యా వాడితో నేస్తం కట్టి ఒట్టేయించుకోబట్టి వీటోమీద వీటో ప్రేలింది. తరువాత పాకిస్తాన్ వాడి వీపు పేలింది. అంచేత కుటుంబంలో కూడా అహింసా విధానం అలీన విధానం అంటూ పనికిరాని పాత నీతులు వల్లిస్తూ కూచోకూడదు. మొగుడు చావచితక కొడుతూంటే పతివ్రతా ధర్మం అని చావు దెబ్బలు తినటం అహింస, తిరగబడి గరిటవిసరటం సాయుధ పోరాటం. అహింస తెలీకే జమ్మిచెట్టుమీంచి ఆయుధాలు దించారా పాండవులు? బంగ్లాదేశ్ విముక్తి అహింసాయుతంగా ఎందుకు జరిపించారు కాదు? రక్తపాతం లేకుండా స్వరాజ్యం సంపాయించినవాళ్ళు త్రివిధ దళాల సహాయంలేకుండా ఢాకాను విడిపించలేకపోయారా?

మన్ని మనం మోసం చేసుకోవచ్చుగాని ఆదర్శాలు వల్లించి చరిత్రను మోసం చేయలేము. యుగధర్మం మారుతూవుంటుంది. లోకంలో జబర్దస్తీ, దౌర్జన్యం, అన్యాయం, మితిమీరినపుడు విల్లంబులు ధరించిన శ్రీరాముడే ప్రజలకు ఆదర్శం కావాలి కాని కొల్లాయి కట్టిన గాంధీ కాదు. బంగ్లాదేశ్‌ను విముక్తం చేయటానికి మనం ఎటువంటి సాహసాలు, త్యాగాలు చేశామో అంతకంటె మించిన త్యాగాలు, సాహసాలు మన ప్రజలు ఆర్థిక బానిసత్వం నుండి విముక్తం చేయటానికై మనం చేయవలసి వుంది. జైల్లో కూర్చొని రాట్నాలు వడకటం వలన హరేరామ హరేకృష్ణ అనటంవలన మన ప్రజలకు నిజమైన విముక్తి లభించదు. దేశంలోని దుష్టశక్తులతో తలపడి పోరాటం సాగిస్తేనే కాని ఒక గొప్ప 'యుద్ధం' ద్వారాకాని మిట్ట పల్లాలు ఏకంకావు. ఎవడో వచ్చి రోడ్డు వేస్తాడు. మనం నడుద్దామని కూర్చుంటే మన చుట్టూ కీకారణ్యం పెరిగి పోయి మనకు భవిష్యత్తు మూసుగుపోతుంది. జైహింద్!

# ఆంధ్రా తుగ్లక్ లేక మా పిచ్చి మావయ్య

**మా**కో తుగ్లక్ మావయ్యున్నాడు. ఆయన్ని అంతా గౌరవంగా ఆంధ్రా తుగ్లక్ గారంటారు. తుగ్లక్ మావయ్య వస్తున్నాడంటే ఒక సంశయ మహావటవృక్షం కదిలివస్తోందన్నమాట.

అగ్గిపెట్టి చూయించి-మావయ్యా ఇది అగ్గిపెట్టి అవునా కాదా అంటే ఖచ్చితంగా ఇది అగ్గిపెట్టి అని మా మావయ్య అనలేడు. అది అగ్గిపెట్టిలా కనిపిస్తోంది. కాని కాకపోవచ్చునే అమ్మాయీ అంటాడు. పోనీ ఇప్పుడు టైం ఎంత? ఏడున్నరేనా అంటే "ఏడున్నర" అనేది సంశయాత్మక మంటాడు మా అంకుల్. కాలం అనంతమైనదే అమ్మాయీ, ఈ గడియారము చూసి ఏడున్నర అంటున్నాము, కాని దీన్ని నమ్మమని ఎవడు చెప్పాడు? అని కాలచక్ర పరిభ్రమణాన్ని గురించి గంట లెక్చరిచ్చి అందరి మతులూ పోగొడతాడు. తుగ్లక్ మావయ్యతో పేచీ ఏవిటంటే అతను ఏదీ అవునూ కాదు అని తేల్చిచెప్పడు. ఇది అవును ఇది కాదు అని చెప్పడానికి మనకు అధికారం లేదంటాడు.

వంకాయ కొత్తిమీర కారంపెట్టి వండనా, వేయించనా అని మా అత్తయ్య అడిగిందనుకోండి. కొత్తిమీర, కారం గురించి ఆంధ్ర విజ్ఞాన సర్వస్వంలో ఏముందో చూడమంటాడు ముందు. ఏ పనిచేసినా బహు గ్రంథ పరామర్శనము చేసి చేయాలి కాని "మీ అమ్మ చెప్పింది కదా అని కొత్తిమీర కారంపెట్టి వండకూడదే అజ్ఞానురాలా" అని మా అత్తయ్యను కోప్పడతాడు. అతను క్షురకర్మ చేయించుకునే వేళలో ఆ క్షురకర్మకారుడు "యోగవాశిష్టం" గురించి తెలుసుకోనందుకు వాడి అజ్ఞానానికి మండి పడతాడు. బ్రెజిల్‌లో కాఫీ పండుతుందని తెలియనివాడు కాఫీహోటలు పెట్టడానికి వీల్లేదంటాడు. బజారుకెళ్ళి నాలుగు కప్పులూ, సాసర్లూ పట్రమ్మంటె పింగాణీ